సకాలంలో పన్నులు చెల్లించాలి

శామీర్‌పేట్: ప్రజలు తమ ఇంటి, వాణిజ్య పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఎం ఎన్ ఆర్ జ్యోతి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీకి చెందిన సాద నాగేందర్ రెడ్డి తన వాణిజ్యసముదాయాలకు సంబంధించి బకాయిలో ఉన్న రూ.3,39,812 పన్నును చెల్లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పన్నులను సకాలంలో చెల్లించకుంటే జరిమానా తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రావన్ కుమార్, బిల్ కలెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

ఇంటిపై జెండా ఆవిష్కరణ



జెండాను ఎగురవేసిన మాజీ కౌన్సిలర్

మేడ్చల్‌రూరల్: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు గుండ్లపోచంపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అమరం సరస్వతి తన ఇంటిపై గురువారం జాతీయ జెండా ఎగురవేశారు. అందరిలో దేశభక్తి జాతీయ భావం నిర్మాణం జరిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయజెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని కోరారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు దినేష్‌రెడ్డి, వంశీకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

వారాంతపు సంతల సమాచారం

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలో ప్రతివారం కూరగాయాలు, ఇతర సామగ్రి విక్రయించే వారంతపు సంతల సమాచారం ఈ విధంగా ఉంది. సోమవారం రైల్వేస్టేషన్ రోడ్డు (పోలీస్ క్వార్టర్స్ రోడ్డు), అత్వెల్లి, రాఘవేంద్రనగర్ కాలనీ మంగళవారం ఉమానగర్, కేఎల్ఆర్ విజయానగర్, బుధవారం ఎన్జీఓస్ కాలనీ(మేడ్చల్), గురువారం వీకర్ సెక్షన్ కాలనీ (జెడ్పీహెచ్ఎస్ స్కూల్), శుక్రవారం సూర్యనగర్, చంద్రానగర్, శనివారం హౌజింగ్‌బోర్డు కాలనీ, కిష్టాపూర్, చెక్‌పోస్టు, ఆర్టీసీ కాలనీ, ఆదివారం ప్రధాన మార్కెట్‌లో ఉంటుంది.

యువకుడి అదృశ్యం

జవహర్‌నగర్: వివాహం ఇష్టం లేదని ఓ యువకుడు లేటర్ రాసి అదృశ్యమయ్యాడు. జవహర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్ లక్ష్మీనగర్‌కు చెందిన బుడ్డోజి విజయ్ (23) తన బావ అయిన వెంకటేష్ ఇంట్లో ఉంటున్నాడు. ఈ మధ్య విజయ్‌కి వివాహం కుదిరింది. ఈ నెల 13న సాయంత్రం తన బావ వెంకటేష్ ఇంటికి రాగా ఇంట్లో విజయ్ కనిపించలేదు. ఇంట్లో వెతకగా అతడె ఓ లెటర్ రాసి పెట్టాడు. 'తనకు వివాహం ఇష్టం లేదని, అందుకే ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని, తన గురించి వెతకొద్దని' లెటర్‌లో రాసి పెట్టాడు. దీంతో విజయ్ ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి నకాష్‌కు ఆహ్వానం

బోడుప్పల్: సాయిరాంనగర్‌కు చెందిన వైకుంఠం నకాష్‌కు ఆగస్టు 15న రాజ్‌భవన్ లాన్స్‌లో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు జరిగే తేనీటి విందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నుంచి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా బోడుప్పల్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ.. గ్రామీణ, సాంస్కృతిక ఇతి వృత్తాలను తెలిపే చేర్యాల నకాషి పెయింటింగ్స్ వేస్తున్నామన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పలు అవార్డులు అందుకున్నట్లు వివరించారు. ఇటీవల జరిగిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ తమ పేరును ప్రస్తావించినట్లు వెల్లడించారు. అంతరించి పోతున్న కళలకు మరలా జీవం పోస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు



గౌతంనగర్: డివిజన్ ఇందిరానెహ్రూనగర్‌లోని షిరిడీసాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. బబ్లూ, శ్రీనివాస్ చారి, కుమార్, బాలు, సాయి, భాస్కర్ పంతులు పాల్గొన్నారు.

జాతీయ జెండాను ఎగురవేయండిలా..




ఘట్‌కేసర్: జాతీయ జెండాను ప్రతి ఏటా స్వాతంత్య్ర, గణతంత్ర, రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎగురవేస్తున్నాం. అయితే జాతీయ జెండాను ఎగురవేసే సమయంలో కొన్ని నియమనిబంధనలను పాటించాల్సి ఉంటుంది.

◆ జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టంలోని 2వ భాగం, 1971 యాక్ట్‌తో కలిపి 2022లో భారత పతాక నిబంధనలను అవతరించాయి. దీన్ని అతిక్రమించిన వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఇంటిపై జెండాను ఎగురవేయాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో జాతీయ జెండా ఎగురవేయడంపై ప్రత్యేక కథనం...

నియమ నిబంధనలు...

- జాతీయ జెండాను గౌరవప్రదంగా చూసుకోవాలి. జెండా చిరిగిపోకుండా, నలిగిపోకుండా ఉండాలి. పాతగా ఉండకూడదు.
- జాతీయ జెండా దీర్ఘ చతురస్త్రాకారంలో ఉండి పొడవు, వెడల్పులు 3:2 నిష్పత్తిలో ఉండాలి.
- జాతీయ జెండాను చేనేత, ఖాదీ, కాటన్ వస్త్రంతో తయారైనది ఉండాలి. ప్లాస్టిక్ జెండాలను వినియోగింకూడదు. జెండాను నీటిమీద, నేలమీద, పడనీయకూడదు. చిరిగిన జెండాను ఆవిష్కరించరాదు.
- జాతీయ జెండాలో పైన కాషాయం రంగు, మధ్యన తెలుపు, కింద ఆకుపచ్చ రంగు ఉండి పతాకం మధ్యలో అశోక ధర్మచక్రం తప్పనిసరిగా ఉండాలి.
- జాతీయ జెండాకు పక్కన ఇతర జెండాను ఆవిష్కరించకూడదు.
- ఒకవేళ ఎగిరేయాల్సి వస్తే తక్కువ ఎత్తులో ఎగిరేయాలి. జాతీయ జెండాను ఉదయం ఎగురవేసి సూర్యస్తమయంలోపు దించేయాలి. ఆ సమయంలో జాతీయ నాయకుల ఫొటోలను పక్కనుంచాలి.
- జెండాను అగౌరవపరిచే విధంగా వస్తువులు, దుస్తువులపై ముద్రించరాదు. జెండాను ఎగిరేసే సమయంలో పోల్ చివరి వరకు వెళ్లిన తర్వాతనే జెండాను ఎగురవేయాలి. అనంతరం జాతీయగీతాన్ని తప్పనిసరిగా పాడాలి. జెండాను అవగతనం చేసిన తర్వాత నిలువునా మూడు భాగాలుగా మడిచి జెండా తాడుతో కట్టిపెట్టాలి.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి...



జాతీయ జెండా దేశం గుర్తింపు, చిహ్నం. అట్టి జెండాను అగౌరవ పరచొద్దు. జెండాను ఎగురవేసే సమయంలో ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటించాలి. నియమాలు అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మాల్లాది రమాకాంత్‌రెడ్డి

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్ మను చౌదరి, డిప్యూటీ కలెక్టర్

సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ ప్రాంగణంలో నేడు నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియలతో కలిసి గురువారం జిల్లా కలెక్టర్ మనుచౌదరి పరిశీలించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పబ్లిక్ అఫైర్) డా. కేశవరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు గౌరవవందనాన్ని స్వీకరించిన పిదప, జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిపై సందేశం ఇవ్వనున్నట్లు కలెక్టర్ వివరించారు.

వాటర్‌ప్రూఫ్ టెంట్ల ఏర్పాటు..

జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో స్వాతంత్య్ర వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేశామన్నారు. అతిథులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. - ప్రోటోకాల్ నిర్వహణలో సమస్యలు రాకుండా చూడాలని, వేడుకలు సజావుగా సాగేలా మైక్ ఏర్పాటుతో పాటు విద్యుత్కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్యాలరీలలో తగినన్నీ కుర్చీలను సమకూర్చాలని సూచించారు. స్టేజీని పూలతో సుందరంగా తీర్చిదిద్దాలని, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల వారు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్, జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి, ఇతర శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



స్నాతకోత్సవంలో విద్యార్థులతో ఎమ్మెల్యే మల్లారెడ్డి

విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్ ప్రథమ స్నాతకోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, ఛాన్సలర్ కల్పనారెడ్డి, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, కార్యదర్శి మహేందర్‌రెడ్డి, అధ్యక్షులు భద్రారెడ్డి, డైరెక్టర్లు షాలినిరెడ్డి, ప్రీతిరెడ్డిలతో కలిసి విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే మల్లారెడ్డి డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజానికి అవసరమయ్యే ఆవిష్కరణలు చేయడంతో ముందుండాలన్నారు. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీన్ అపర్ణ, మహ్మద్ రఫీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తి రిమాండ్

మద్యం మత్తులో యువకుడి వీరంగం



పెన్నింటి అజయ్‌రెడ్డి

ఘట్‌కేసర్: ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో ట్రాఫిక్ కానిస్టేబుల్ కృష్ణ గురువారం సాయంత్రం విధులు నిర్వహిస్తుండగా.. ఓ కారు రాంగ్‌రూట్‌లో రావడాన్ని గమనించాడు. కారును ఆపేందుకు కానిస్టేబుల్ ప్రయత్నించగా.. కారులో ఉన్న యాదాద్రి-భువనగిరిజిల్లా బీబీనగర్ మండలం జూలూరుకు చెందిన పెన్నింటి అజయ్‌రెడ్డి (27) తాగిన మైకంలో కారుతో ఢీకొట్టే ప్రయత్నం చేశాడు. »నన్నే ఆపుతావా.. అంటూ« కానిస్టేబుల్‌ను దుర్భషలాడుతూ.. దాడికి పాల్పడ్డాడు. కానిస్టేబుల్ వీడియో తీసేందుకు ప్రయత్నించగా.. ఫోన్ లాక్కొని పగులగొట్టాడు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

వర్షాలపై మాన్సూన్ టీమ్‌తో సమీక్ష



కుషాయిగూడ: బారీ వర్షాల నేపథ్యంలో మాన్సూన్ టీమ్ సభ్యులతో పాటుగా అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. గురువారం ఆమె మాన్‌సూన్ టీమ్‌తో కుషాయిగూడ వార్డు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చర్లపల్లి డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులున్నా.. నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కుషాయిగూడ కూరగాయాల మార్కెట్‌ను కార్పొరేటర్ సందర్శించారు. పైకప్పు పెచ్చులూడుతున్న పరిస్థితులను ఆమె పరిశీలించారు. మార్కెట్ అభివృద్ధికి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రియదర్శిని కాలనీలో దుర్గా మాత ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాగారంలో 'విభజన గాయాల స్మృతి దినం'

కీసర: నాగారం మున్సిపాలిటీలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'విభజన గాయాల స్మృతి దినం' సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి మౌన ప్రదర్శన చేశారు. మాజీ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. భారతీయులకు దేశ విభజన అనేది ఎంతో బాధాకరమైన ఘటన అన్నారు. అప్పటి కాంగ్రెస్ పార్టీ అనాలోచిత నిర్ణయాలతో అఖండ భారతదేశంలోని ఓ భాగం విడిపోయి పాకిస్తాన్‌గా మారిందన్నారు. మన భూభాగాన్ని కోల్పోవడం ప్రతి ఒక్క భారత పౌరుడికి గాయంలాంటిదేనని అభిప్రాయపడ్డారు.



బీజేపీ నేతలు సుదర్శన్‌రెడ్డి, శోభారెడ్డి, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీ, శ్రీనివాస్‌గౌడ్, మహేష్, సంపత్‌కుమార్, నాగరాజుయాదవ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

మేడిపల్లి: ఓ మహిళ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమలానగర్‌లో నివాసం ఉంటున్న కన్నా సౌజన్య భర్త, కుమారుడితో నివాసం ఉంటోంది. తన కుమారుడిని చూసుకోవడానికి తన తల్లి బద్రమ్మ(45)ను ఊరి నుంచి పిలిపించి తన వద్దే ఉంచుకుంటోంది. కాగా తల్లి కొద్ది నెలల నుంచి టిఫిన్ సెంటర్లలో పనిచేసుకుంటూ.. తన బిడ్డ వద్దే ఉంటోంది. 9న సొంతూరికి వెళ్లి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు తిరిగి ఇంటికొచ్చిన ఆమెకు తల్లి కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిస్ట్రేషన్ ఆదేశాల మేరకు గురువారం 17వ డివిజన్ పరిధిలోని గెలాక్సీ హోమ్స్‌లో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోడుప్పల్‌ను హరితవనంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిద్దామని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రావు, రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈ రాకేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, భార్గవి కాలనీ వాసులు పాల్గొన్నారు.



బహుజన అమరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

మల్కాజిగిరి: సఫిల్‌గూడ మినీట్యాంక్‌బండ్‌పై బహుజన కులాల అమరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని మల్కాజిగిరి సర్కిల్ డీసీ జకియా సుల్తానాకు పూలపల్లి సుందర్‌యాదవ్ ఆధ్వర్యంలో బహుజన కులాల చైతన్య వేదిక నాయకులు వినతి పత్రం అందజేశారు. గురువారం వారు మాట్లాడుతూ.. జ్యోతిరావుపూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రావు, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సర్వాయి పాపన్నగౌడ్, బెల్లి లలిత, కొమరంభీమ్, కొండా లక్ష్మణ్ బాపూజీ, శ్రీకాంత్‌చారి, జయశంకర్ లాంటి మహనీయుల గురించి తెలుసుకోవాలన్నారు.

19 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు



కీసరలో మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శామీర్‌పేట్: కార్మికుల హక్కుల సాధనకై పోరాట ఉద్యమాలు చేసే పార్టీ సీపీఐ అని, రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం గౌవర అధ్యక్షుడు డీజీ సాయిలుగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 19 నుంచి 22 వరకు గాజులరామారంలోని మహారాజ ఫంక్షన్‌హాల్‌లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ శామీర్‌పేట మండల కార్యదర్శి నరేంద్రప్రసాద్, మూడుచింతలపల్లి మండల కార్యదర్శి రాములుగౌడ్, అల్వాల్ మండల కార్యదర్శి బాబు, మేడ్చల్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జంగయ్య, అల్వాల్ శాఖ కార్యదర్శి వెంకటేష్, పార్టీ నాయకులు నరేంద్ర చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

కీసర: సీపీఐ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. గురువారం కీసర అంబేడ్కర్ విగ్రహం మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింహులు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు దర్శనం యాదగిరి, స్వరూప, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



మహేష్ (ఫైల్)

కీసర: ఆటో ఢీ కొని వ్యక్తి మృతిచెందిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. చీర్యాలలో నివసించే జూపల్లి మహేష్ (56) కూలి పనిచేస్తుంటాడు. ఇంట్లో సరుకుల కోసం తన సైకిల్‌పై బుధవారం రాత్రి కీసరకు వచ్చాడు. కీసర వెంకటసాయి థియేటర్ వద్ద రోడ్డు పక్కనే సైకిల్ నిలిపి మరో వైపు రోడ్డు దాటుతుండగా ఈసీఐఎల్ నుండి వేగంగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. దీంతో కిందపడిన మహేష్‌కు తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 సాయంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మహేష్ మృతిచెందాడు. మృతుని కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.



నాగారంలో స్వీట్లు పంపిణీ చేస్తున్న సుదర్శన్‌రెడ్డి, చంద్రారెడ్డి

హర్‌ఘర్ తిరంగా

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీనగర్‌లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం బీజేపీ నేతలు ఇంటింటికీ వెళ్లి జాతీయ జెండాలు, స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, నేతాజీనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

శామీర్‌పేట్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట పెద్దమ్మ కాలనీకి చెందిన బెజ్జరవేణి యువసాయి (20), శామీర్‌పేట పెద్దమ్మకాలనీలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. గత కొంతకాలంగా దృష్టి సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా ఈ క్రమంలో గురువారం తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకి వెళ్లగా.. అతడు ఇంటి పైకప్పుకు ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటికొచ్చిన తండ్రి స్థానికుల సాయంతో కిందకి దింపగా.. అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందిచగా.. వారు ఘటన స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాడు నగరానికి... నేడు మేడ్చల్ కే !

దశాబ్దకాలంలో మారిన మేడ్చల్ ముఖచిత్రం



మేడ్చల్ పట్టణం

మేడ్చల్: పదేళ్ల వరకు ఏ వస్తువు కొనుగోలు చేయాలనుకున్నా.. నగరానికి పరుగుతీయాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అన్ని రకాల వస్తువులు, దుస్తులు, ఆభరణాలు మేడ్చల్‌లో లభ్యమయ్యే స్థాయికి ఎదిగింది. జాతీయరహదారిపైకి ఎక్కాలంటే భారీ వాహనాల రాకపోకలతో భయంగా ఉండేది. పట్టణీకరణ వైపు ప్రపంచం అడుగులు వేస్తుండటంతో మేడ్చల్ అదే స్థాయిలో ముందడుగులు వేసి అభివృద్ధిలో దూసుకెళ్తోంది.

అన్ని రకాల వస్తువుల విక్రయం..

ఎంఎన్‌సీ కంపెనీలు, ప్రధానంగా విత్తన కంపెనీలు, ప్రముఖ లాజిస్టిక్ కంపెనీల గోదామ్‌లు, రియల్ రంగంలో పేరున్న సంస్థల వెంచర్లు వంటివి మేడ్చల్‌కు రావడంతో ప్రజలు మేడ్చల్‌లో నివాసం ఉండేందుకు ఇష్టపడుతుండటంతో మేడ్చల్ రూపురేఖలు మారిపోయాయి.

◆ ప్రధానంగా ఉత్తర భారతీయులు ఇక్కడి వ్యాపారంలో అడుగు పెట్టడంతో మేడ్చల్ మార్కెట్‌లో అభించని వస్తువు లేకుండా ఉంది.

◆ బంగారం దుకాణాలు, ద్విచక్రవాహన షోరూంలు, కార్ల, షోరూంలు మెకానిక్ షెడ్లు, పెద్ద ఫంక్షన్‌హాల్స్, ఇలా అన్ని రకాల వ్యాపారసంస్థలు వెలిశాయి.

◆ ప్రముఖ బ్యాంకులు, పేరున్న కళాశాలలు, స్కూళ్లు, హోటళ్లు, లాడ్జీలు.. ఇలా అన్ని మేడ్చల్‌లో ఉన్నాయి. గేటెడ్ కమ్యూనిటీ వెంచర్లు, కాలుష్యం లేని ప్రాంతం కావడంతో వీఐపీలు సైతం మేడ్చల్ మండల పరిధిలో నివాసం ఉంటున్నారు.

10 కి.మీ దూరంలో అన్నీ..

44వ జాతీయరహదారిపై ఉన్న మేడ్చల్ నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొంపల్లి, సుచిత్ర జంక్షన్ వరకు వెళ్తే అన్ని వస్తువులు లభ్యమవుతున్నాయి. పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్, ప్రఖ్యాత రెస్టారెంట్లు, మల్టీప్లెక్స్ సినిమాహాళ్లు, బట్టలు, కిరాణం, ఆటవస్తువులు, మహిళలకు చీరలు ఇలా అన్ని రకాల సంస్థలు అక్కడ ఉండటంతో మేడ్చల్‌వాసులు నగరానికి వెళ్లే బాధ తప్పింది. మేడ్చల్‌తో పాటు పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో మేడ్చల్ అభివృద్ధి వైపు వేగంగా అడుగులు వేస్తోంది

గుండ్లపోచంపల్లిలో అంతా వీఐపీలే..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గుండ్లపోచంపల్లి, కండ్లకోయలలో ప్రఖ్యాత రియల్ ఎస్టేట్ కంపెనీలో ప్రాజెక్టులు రావడంతో గుండ్లపోచంపల్లి వీఐపీ ప్రాంతంగా మారింది. గేటెడ్ కమ్యూనిటీ వెంచర్లు, బహుళ అంతస్తులు అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత విల్లాలు ఖరీదైన భవనాలు రావడంతో ఆ ప్రాంతం రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. వేలసంఖ్యలో గుండ్లపోచంపల్లిలో నివాసం ఉంటున్నారు.

నాడు గ్రామాలు నేడు మున్సిపాలిటీలు..

ఉమ్మడి మేడ్చల్ మండలం మొత్తం గ్రామ పంచాయతీలుగా ఉండేది. 32 గ్రామాలతో మండలం ఉండగా.. నేడు మూడు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. మేడ్చల్, ఎల్లంపేట్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో నాటి గ్రామాల మేడ్చల్ పట్టణ ప్రాంతంగా మారింది

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387